క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఏఓలు

మధిర ఏఓగా సాయి దీక్షిత్..



మధిర: మధిర మండల వ్యవసాయ అధికారిగా కె.సాయి దీక్షిత్ మంగళవారం మధిర వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

బోనకల్ ఏఓగా వినయ్‌కుమార్..



బోనకల్: బోనకల్ మండల వ్యవసాయ అధికారిగా పసునూరి వినయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌ను ఏఈఓలు నాగినేని నాగసాయి, బంధం త్రివేణీ, గోగుల హరికృష్ణ, బంధం రజిత, పండగ అనూష, షేక్ హుస్సేన్, సాహెబ్‌లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

ఎర్రుపాలెం ఏఓగా సాయిశివ..



ఎర్రుపాలెం: మండల వ్యవసాయాధికారిగా బోయినపల్లి సాయిశివ మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈఓల సహకారంతో గ్రామాల్లో రైతులకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఓ బాలకృష్ణ ఉన్నారు.

బాలికలకు అవగాహన

కొణిజర్ల: జాతీయ న్యుమోనియా డే సందర్భంగా మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు కె.రజిని, జీనత్ షాహీన్‌లు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.


బీజేపీ బూత్ కమిటీల నియామకం

తల్లాడ: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెలాఖరుకు బూత్ స్థాయి కమిటీల నియామకం చేపట్టనున్నట్లు పార్టీ సత్తుపల్లి నియోజక వర్గ ఇన్‌చార్జ్ భాస్కర్ల వీరంరాజు అన్నారు. బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లా నాగులు, మండల ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి కృష్ణ, సంగీతం సాయిచంద్, మండల కార్యదర్శి గాదె కృష్ణారావు, పెరికె కిరణ్, రాయల రమేష్, చల్లా నరేష్ పాల్గొన్నారు.

నేడు మరుగుదొడ్ల ప్రారంభం

కారేపల్లి: మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ మాధారం డైలమైట్ మైన్స్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను బుధవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ప్రారంభిస్తారని ఎంపీడీఓ సురేందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మరుగుదొడ్ల ప్రారంభోత్సవ పనులను ఎంపీఓ రవీంద్రప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేదరి టోనీవీరప్రతాప్, ఎండీ.హనీఫ్, తురక నారాయణ, షేక్ షఫీ, ఆదెర్ల రాములు తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో అన్నదానాలు



మెట్టాంజనేయ స్వామి ఆలయంలో..

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని వేంసూరురోడ్ శ్రీ మెట్టాంజనేయస్వామి, అయ్యగారిపేట శ్రీభక్తాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొడపాక రామకృష్ణ, మారుతి, కృష్ణకుమారి, చైతన్య, సాయి, బంతినేని మాధవరావు, వాణిశ్రీ, కౌశిక్, బొంతు వేణు, సుమలత, సతీష్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. కమిటీల నిర్వాహకులు చల్లగుండ్ల కృష్ణయ్య, మల్లూరు అంకమరాజు, కాలినేని కాంతారావు, నాగళ్ల ప్రసాద్, మాధురి మధు, పురుషోత్తం, రజిని, విజయకాంతి పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బహుజన సేవా సమితి అధ్యక్షుడు మోదుగు బాలకృష్ణ చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. నిరుపేదలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పగడాల లచ్చిరెడ్డి, శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

ఇంకా స్టిక్కర్లే అంటించలే..!

- కొనసాగుతున్న కుటుంబ సర్వే..
- మరో వైపు స్టిక్కర్లు అంటించక ప్రజలు ఆందోళన
- కుటుంబాలు పెరిగాయంటున్న ఉద్యోగులు



ఓ ఇంట్లో వివరాలు నమోదు చేస్తున్న ఎన్యూమరేటర్

సత్తుపల్లిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఓ వైపు ముమ్మరంగా నిర్వహిస్తుండగా మరో వైపు ఇంకా చాలా ఇళ్లకు స్టిక్కర్లు అంటించని పరిస్థితి నెలకొంది. సత్తుపల్లి మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వే కోసం తొలుత 90 బ్లాక్‌లుగా విభజించారు. ఈ నెల 6 నుంచి 8 వరకు ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటిని గుర్తించి స్టిక్కర్లు అంటించే కార్యక్రమం చేపట్టారు. ఏడుగురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో 97 మంది ఎన్యూమరేటర్లు సర్వే చేస్తుండగా ఇంకా పట్టణంలో 23 వార్డుల్లోనూ చాలా ఇళ్లకు స్టిక్కర్లు అంటించకపోవటంతో తమ ఇళ్లు సర్వే చేస్తారో లేదోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కుటుంబాలు..

మున్సిపాలిటీలో 9,697 నివాసాలకు ఆస్తి పన్ను ఉంది. ఈ ఇళ్లతో పాటు కొత్తగా కొమ్మేపల్లి కాలనీ, సింగరేణి క్వార్టర్స్ కూడా మున్సిపాలిటీ పరిధిలోని సిబ్బందికే సర్వే బాధ్యత అప్పగించారు. దీంతో బ్లాక్‌లు 96కు పెరిగాయి. సుమారు 13 వేలకు కుటుంబాలు పెరగటంతో ఇక స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పక్కన బెట్టి ఎన్యూమరేటర్లు సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే పలు ఇళ్లకు స్టిక్కర్లు అంటించకపోవటంతో ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టిక్కర్లు అంటించే ప్రక్రియ గందరగోళంగా మారింది. స్టిక్కర్లు లేని నివాసితులు తమ కుటుంబాలను సర్వే చేయరేమోనని గుబులు చెందుతున్నారు. ఇప్పటికే సమగ్ర సర్వే కార్యక్రమం సాగుతుందని, ఇంకా మా ఇళ్లకు స్టిక్కర్లు లేవని స్థానికులు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉంటే ఎన్యూమరేటర్లకు 150 నుంచి 175 వరకు కుటుంబాలు కేటాయించాల్సి ఉండగా అంతకు మించి కుటుంబాలను కేటాయించటంతో సర్వే ప్రక్రియకు భారంగా మారుతోందని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు.

ప్రతీ ఇంటిని సర్వే చేస్తాం..



సత్తుపల్లి పట్టణ పరిధిలోని ప్రతీ ఇంటిని సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తాం. సర్వే స్టిక్కర్లు ఇంటింటికి అంటించలేదని ఆందోళన చెందొద్దు. ప్రతీ ఇంటికి స్టిక్కర్లు అంటించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆస్తిపన్ను చెల్లించే నివాసాలకంటే ఈ సర్వేలో మూడువేల కుటుంబాలు ఎక్కువగా పెరిగాయి. సర్వే సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటాం.

– ఎం.రవిబాబు, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

వైద్యంలో నిర్లక్ష్యం వహిస్తే సహించం

- ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: రోగులకు వైద్యసేవలు అందించటంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హెచ్చరించారు. సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీమాంక్ సెంటర్‌తో పాటు ఓపీ విభాగం, వార్డులను సందర్శించి మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఏరియా ఆస్పత్రి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుతో కలిసి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. గతంలో నెలకు 120కి పైగా కాన్పులు జరిగేవని, ఇప్పుడు వైద్యులు, సిబ్బంది ఉన్నా.. ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. సాధారణ కాన్పులు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యమిత్రలు సమయపాలన పాటించకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. డైట్ కాంట్రాక్టర్ రోగులకు సరిపడా ఆహారం పెట్టాలని పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, వైద్యులు సురేష్‌నారాయణ్, డాక్టర్ పి.వసుమతీదేవి, నారాయణమ్మ, సాత్విక్, సాంబశివరావు, గ్రీష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్లు రామలక్ష్మి, రాధా కృష్ణకుమారి, హెచ్‌ఎస్ హైమావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, చల్లగుళ్ల నర్సింహారావు, దోమా ఆనంద్, కమల్‌పాషా, గాదె చెన్నారావు, ఎండి ఫయాజ్‌అలీ, కుమారి పాల్గొన్నారు.

నెలాఖరులోపు మొక్కజొన్న వేయాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

ఏన్కూరు: మొక్కజొన్న వేసే రైతులు నవంబర్ నెలాఖరు లోపు పంట వేసుకోవాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ అన్నారు. మండల పరిధిలోని నాచారం రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగుపై పలు సూచనలు ఇచ్చారు. విత్తనాలు కొనుగోలు చేసినపుడు బిల్లులు భద్రపరుచుకోవాలన్నారు. ఆయిల్‌పాం సాగుపై ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి వివరించారు. ఏఓ నర్సింహారావు, ఏఈఓ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సత్తుపల్లి: రైతులకు ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలప్పుడు వాగ్దానం చేసి అమలు చేయడం లేదని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం సత్తుపల్లి మండలం కాకర్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ధాన్యం కొనకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి శరత్, బొజ్జా వెంకటేశ్వర్లు, కృష్ణ, శ్రీనివాస్, వెంకన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

సీపీఐది వందేళ్ల పోరాట చరిత్ర



బోనకల్: సభ్యత్వాలు అందజేస్తున్న పోటు ప్రసాద్

బోనకల్: అనునిత్యం ప్రజాసమస్యలపై పోరాడిన సీపీఐది వందేళ్ల చరిత్ర అని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండలంలోని రాపల్లె గ్రామంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని, ప్రజా సంఘాల మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి ఏనుగు రవికుమార్, కొంగర రామారావు, ఏనుగు వేణు, మడుపల్లి నరేష్, ఏనుగు జయప్రద, ఏనుగు గాంధీ, ప్రవీణ, ఉపేందర్‌రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి: మండలంలోని విశ్వనాథపల్లిలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఎర్రబాబు, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు ఏపూరి లతాదేవి, పుచ్చకాయల శ్రీనివాసరావు, వడ్డే వెంకటయ్య, రంజాన్, బొచ్చు ధనమ్మ, బొమ్మల కృష్ణ, కిన్నెర ముత్తమ్మ, పురం వెంకన్న పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



నవీన్‌రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపక బృందం

తల్లాడ: మోడల్ స్కూల్ (టీఎస్ఎంఎస్) రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్ 14 వాలీబాల్ టోర్నమెంట్‌కు మండలంలోని కుర్నవల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి బి.నవీన్ ఎంపికయ్యాడు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లా వాలీబాల్ అండర్ 14 ఎంపికలు జరిగగా నవీన్‌రెడ్డి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాల సిబ్బంది అభినందించారు. హెచ్‌ఎం ఝాన్సీరాణి, పిజికల్ డైరెక్టర్ శివ, ఉపాధ్యాయులు ఉన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సంఘటితం కావాలి



కారేపల్లి: మాట్లాడుతున్న ఎస్సై రాజారాం



ముదిగొండ: అవగాహన కల్పిస్తున్న రాణి

కారేపల్లి: మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులంతా సంఘటితం కావాలని ఎస్సై ఎస్.రాజారాం అన్నారు. బుధవారం కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి అధ్యక్షతన స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు సుధారాణి, తమ్మిశెట్టి శ్రీనివాస్, శేషుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: విద్యార్థులు పొగాకు ఉత్పత్తుల వాడకంకు దూరంగా ఉండాలని పీహెచ్ఎన్ రాణి సూచించారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన, పొగాకు ఉత్పత్తులు వాడకం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ లత, అధ్యాపకులు గురవయ్య, ఆమోస్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

108 కలశాలతో అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం రాత్రి 108 కలశాలతో పరమేశ్వరుడికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకం చేశారు. అర్చకులు కంచెల సతీష్ శర్మ వేదమంత్రోచ్చరణల కనులపండువగా అభిషేకం జరిగింది. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భవిష్యత్‌కు చదువే పునాది



బహుమతులు అందజేస్తున్న మల్లు నందిని

ఎర్రుపాలెం: విద్యార్థులు చదువుపై బాగా దృష్టి పెట్టాలని, వారి భవిష్యత్‌కు చదువే పునాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠశాలల మండలస్థాయి కబడ్డీ, ఖో–ఖో క్రీడలు నిర్వహించగా విజేతలకు మంగళవారం బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికుమార్, ఎంఈఓ మురళీమోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, క్రీడల దాత యరమల పూర్ణచంద్రారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, ప్రతాపరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, లక్ష్మణరావు, సాయి, పిచ్చిరెడ్డి, వేమిరెడ్డి రామిరెడ్డి, పుల్లారెడ్డి, షేక్ ఇస్మాయిల్, అక్కిరెడ్డి, అంకిరెడ్డి, దేవరకొండ రాజీవ్ గాంధీ, బాబురావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత



పుస్తకాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో 1991–91 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం గురుకుల విద్యార్థులకు రూ.20 వేల జేఈఈ మెయిన్ పుస్తకాలు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులను అందజేశారు. గ్రంథాలయ పుస్తకాలకు రూ.5 వేల నగదు అందజేసారు. ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు నాగయ్య, కృష్ణ, ఆనందరావు, కుటుంబరావు, శివకుమార్, సునీల్ ఉన్నారు.

ఏకనామం భజన

తల్లాడ: మండలంలోని తల్లాడ, అంజనాపురం గ్రామాల్లో మంగళవారం ఏకనామం భజన, హనుమాన్ చాలీసా, గోవింద నామభజన నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, ప్రఖండ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయంలో ఏకనామం భజన, అంజనాపురం ఆంజనేయ ఆలయంలో హనుమాన్ చాలీసా, గోవింద నామాల భజన కార్యక్రమం నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ, సీతంపేట గ్రామాల్లో లబ్ధిదారులకు మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంభం వీరభద్రం, మంగపతిరావు, కంచర్ల దేవస్వామి, శెట్టిపోగు దేవస్థానం, నారపోగు కొండలరావు, యాకోబు, నర్సింగుల చిన భిక్షమయ్య, బూర వీరబాబు, ఆవుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత

ఎర్రుపాలెం: రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత పెరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ గాలికొదిలేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, ఆంగోతు వెంకటేశ్వర్లు, సగుర్తి సంజీవరావు, షేక్ లాలా, మేడగాని తిరుపతిరావు, షేక్ నాగుల్‌మీరా , దూదిగం బసవయ్య, పెసరమల్లి ఇమ్మేలమ్మ, సుబ్బారెడ్డి తదితరులున్నారు.

ముమ్మరంగా సర్వే



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

కల్లూరురూరల్: మండలంలో ఇంటింటి సర్వే ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఎన్యూమరేటర్ తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు.

పత్తి కొనుగోలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మధిర: పత్తి కొనుగోలు నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పాపినేని రామనరసయ్య, మందా సైదులు కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో రైతుల తరఫున స్థానిక తహసీల్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ తేమశాతం సాకుగా చెప్పి పత్తి కొనుగోలు ప్రారంభించలేదన్నారు. తేమశాతాన్ని 12శాతం నుంచి 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పత్తిని ఏఈఓలు సందర్శించి తేమ శాతాన్ని పరీక్షించి రైతులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం నరసింహారావు, తేలప్రోలు రాధాకృష్ణ, విల్సన్, మధు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ



రుణాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో మంగళవారం అయ్యవారిగూడెం సొసైటీకి చెందిన 29 మంది రైతులకు రూ.25.29 లక్షల రుణాలను బ్యాంకు మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావులు పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, క్యాషియర్ మౌనిక, జానీ, సంఘం సెక్రెటరీ మోహనరావు ఉన్నారు.

సింహగర్జన సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పల్లా రాజశేఖర్

కొణిజర్ల: డిసెంబర్ 1న హైదరాబాద్ జరిగే మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి వైస్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది పల్లా రాజశేఖర్ అన్నారు. మండలంలోని పెద్దమునగాలలో మంగళవారం ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో మాలల ఆత్మీయ సమ్మేళనం జర్నలిస్టు మోటపోతుల బాబూరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేస్తున్న పోరాటానికి ప్రతి మాల ఉద్యోగి, ప్రతి గ్రామం నుంచి మాలల తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. గుంతేటి వీరభద్రం, ముఖ్య సలహాదారుడు లింగాల రవికుమార్, సత్యనారాయణ, దుంపల ప్రకాశం, బైరం బాలరాజు, కిషోర్, సీతారాములు, ఆనందరావు, పాపారావు వెంకటరత్నం పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం



వ్రత పూజలు నిర్వహిస్తున్న దంపతులు

చింతకాని: మండల కేంద్రంలోని శ్రీ భూ, నీలా సమేత చెన్నకేశవస్వామి దేవాలయంలో కార్తీక మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, గోపి కృష్ణామాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..

- రాకపోకలు నిలిపివేసిన అధికారులు



రాకపోకలు నిలిపివేస్తున్న అధికారులు

కొణిజర్ల: మండలంలోని అనంతారం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన పురాతన కల్వర్టు కూలడానికి సిద్ధంగా ఉండి ప్రమాదకరంగా ఉండటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం నుంచి ఆ రోడ్డుపై రాకపోకలు నిలిపి వేశారు. తనికెళ్ల నుంచి అమ్మపాలెం, చిన్నగోపతి, అనంతారం, పెద్దగోపతి, చిన్నమునగాల మీదుగా తాటిపూడి వరకు నాలుగేళ్ల క్రితం డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఇటీవల గ్రీన్‌ఫీల్డ్ హైవే ఖమ్మం నుంచి రాజమండ్రి వరకు నిర్మిస్తున్న ఈ రోడ్డుకు మట్టి తోలకాల నిమిత్తం భారీ డంపర్లు రోడ్డుపై తిరుగుతుండటంతో అనంతారం సమీపంలోని పురాతన కల్వర్టు ధ్వంసమై ఓ వైపు కూలిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ మోడేపల్లి రమేష్, ఏఈ వసుంధరలు ఘటనా స్థలానికి చేరుకుని కల్వర్టును పరిశీలించారు. తక్షణమే రాకపోకలు నిలిపి వేసి కల్వర్టు మరమ్మతులు చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఈ రమేష్ తెలిపారు. కల్వర్టు మరమ్మతు చేసేంత వరకు రాకపోకలు నిలిపివేస్తున్నామని వాహనదారులు గమనించాలన్నారు.